ఈ పుస్తకాన్ని వదలగూడదు. తనదగ్గర సబ్‌స్క్రిప్షన్ కట్టే డబ్బులేదు. కనుక దొంగతనం చేసి ఎందుకు తీసికెళ్ళకూడదు? ఎవరికీ అక్కర్లేని, ఉపయోగపడని పుస్తకం తనకు వుపయోగపడుతుంది అనుకున్నప్పుడు తను తీసికెళ్ళడంలో తప్పులేదు. అక్కడనుంచి ఎలాగయినా తీసికెళ్ళాలనే నిర్ణయానికొచ్చాడు.

ఎలా ..... ఎలా ..... ఎలా ..... తీసికెళ్తాడు.

ఆ గది నాలుగువేపులా చూశాడు. కిటికీలోంచి బయటకు విసిరేసి, కిందకెళ్ళి పట్టుకుపోదామంటే కిటికీలన్నీ గట్టిగా మూసి వున్నాయి. ఇలాంటి దొంగతనాలకు ఆస్కారం వుంటుందనే మూసేశారేమో .....

తలతిప్పి--- దూరంగా కన్పిస్తున్న లైబ్రేరియన్ టేబుల్‌వేపు చూశాడు.

అక్కడ కూర్చున్న వ్యక్తికి అనుమానం వచ్చిందేమో ..... మధుకర్ వేపే చూస్తున్నాడు.

ఎలా ..... ఎలా ..... ఇక్కడినుంచి దీనిని తీసికెళ్ళడం ఎలా .....

జనరల్ బుక్స్ విభాగానికి ఆనుకొని చిన్నపిల్లల డివిజన్ వుంది. అక్కడ దాదాపు ఒక పదిహేనుమంది పిల్లలు, అందరూ అయిదు, పదేళ్ళలోపు పిల్లలు బొమ్మల పుస్తకాలు, కథలూ చదువుకుంటున్నారు.

అయిదేళ్ళ చిన్న పిల్లల పక్కన స్కూలు బ్యాగ్స్ వున్నాయి.

వాళ్ళందరూ చిక్కడపల్లిలోవున్న 'ఆగ్నేష్ కాన్వెంట్ స్కూలు' పిల్లలు.

అక్కడ ఒకచోట ఒక పాప బుద్ధిగా 'శ్రీ కృష్ణుడు' బొమ్మల కథల పుస్తకాన్ని చదువుకుంటోంది.

ఆరేళ్ళ పాప ముద్దుగా, బొద్దుగా తెలుపు, ఆకుపచ్చరంగు యూనిఫారంతో ఆకుతో కోసిన తెల్ల గులాబీలా వుంది.

ఆ పాప దగ్గరకు నడిచాడు. ఆ పాప పక్కనేవున్న 'స్కూల్ బేగ్' వేపు చూస్తూ-

పక్కన కూచుని "ఏం బేబీ, ఏం పేరు నీ పేరు ..... " అని అడిగాడు.

ఆ బేబీ సీరియస్‌గా తలెత్తి తనవేపే చూసి నవ్వుతున్న అంకుల్, అందమైన ముఖాన్ని చూస్తూ--

"డాలీ" అంది ముద్దుగా.

"గుడ్ ..... నేమ్ ..... "

"ఏం క్లాస్ చదువుతున్నావ్"

"ఫస్టు క్లాస్ ..... " చెప్పింది.

"రోజూ ఇక్కడికొస్తావా ..... నువ్వు ..."

"బుక్స్ రీడింగ్ పీరియడ్ వున్నప్పుడు వస్తాం" అని చెప్పి మళ్ళీ పుస్తకపఠనంలో మునిగిపోయింది సీరియస్‌గా.

పిల్లలందర్నీ చూస్తూ, ఆ పాప చుట్టూ అటు ఇటూ తిరిగి, ఆ పాప హేండ్‌బాగ్‌లో తన చేతిలోని బుక్‌ని పడేశాడు నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి జనరల్ బుక్స్ విభాగంలో కూర్చున్నాడు.

లైబ్రేరియన్ సీటువేపు చూశాడు. ఆ సీట్లో లేడాయన.

ఆ పిల్లలు ఎప్పుడు కదుల్తారా ..... అని ఎదురు చూస్తున్నాడు. పది నిమిషాల తర్వాత వాళ్ళ టీచర్ రావడంతో పిల్లలందరూ లేచారు. మధుకర్ కుర్చీలోంచి లేచాడు.

పిల్లలందరూ చిల్డ్రన్ విభాగంలోంచి బయటకెళ్ళిపోయారు. వరండాలోంచి మధుకర్ గబగబా మెట్లుదిగి వెళ్ళి కింది హాల్లో, బయట లాన్‌లో, గేటువేపు పరుగెత్తికెళ్ళి చూశాడు.

ఎక్కడా ఆ పిల్లలు జాడ కనబడలేదు.

"ఆ ఆగ్నేష్ స్కూలెక్కడో, ఆ స్కూల్లో ఆ పిల్లెక్కడో ఏమిటో ....." అని మనసులో అనుకొని రోడ్డుమీద కొచ్చాడు. ఒకరిద్దర్ని ఆ స్కూలెక్కడుందో అడగ్గా, వాళ్ళు చెప్పిన అడ్రస్ పట్టుకుని, మార్కెట్ ప్రాంతంలో వున్న స్కూలు దగ్గరకొచ్చాడు. గబగబా లోనకెళ్ళబోతున్న మధుకర్‌ని--

"అరె భాయ్ ..... జరఠైరో ..... పేరెంట్ వా ..... లంచ్ టైమ్ ..... ఇంకో గంటుంది. అప్పుడు రా ..... "

"రెణ్నిముషాల్లో వచ్చేస్తానయ్యా ..... "

"లాభంలేదు ..... స్ట్రిక్టంటే స్ట్రిక్టే ..... " లోని కెళ్ళనివ్వలేదు వాచ్‌మెన్.

ఇంకో గంటసేపు తను ఇక్కడ వెయిట్ చెయ్యక తప్పదు-- అనుకుంటూ ఎదురుగా వున్న ఫుట్‌పాత్ మీద నిలబడ్డాడు మధుకర్ .

అదే సమయంలో--

ఆ స్కూలు హెడ్ మిస్ట్రెస్ గదిలో కూర్చుంది మహతి. తన ప్రయత్నంలో భాగంగా ముందు ఇమ్మీడియట్‌గా చిన్నదో పెద్దదో ఉద్యోగం సంపాదించుకోవాలనుకుంది. ఆ హెడ్ మిస్ట్రెస్ సుధాచౌదరి, హేమలత పక్కింట్లోనే వుంటుంది. హేమలత రికమెండ్ చేయగా అక్కడకొచ్చింది మహతి.

"సీ ..... మై చైల్డ్..... ఏం చదువుకున్నానన్నావ్ ..... "

చెప్పింది మహతి.

“డిగ్రీల్లేని వాళ్ళకు, పూర్తికాని వాళ్ళకు ఉద్యోగాలిస్తే మా స్కూల్ ప్రెస్టేజేం కాను ..... మేం ఇప్పటివరకూ తీసుకున్న స్టాఫ్ అంతా డిగ్రీలుండడమే కాకుండా, ట్రైనింగ్ వున్నవాళ్ళూ, ఎక్స్‌పీరియన్స్‌డ్. అండర్ గ్రాడ్యుయేట్లని తీసుకోలేదు. ఓ పని చెయ్యి ..... గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిరా ..... ఉద్యోగం ఇస్తాను” చెప్పింది హెడ్ మిస్ట్రెస్.

నవ్వొచ్చింది మహతికి ఏదో సామెత గుర్తుకొచ్చింది.

“నాకు ఉద్యోగం చాలా అవసరం అండీ ..... అందుకే హేమలత రికమండ్ చేసింది.”

“అవునమ్మా ..... హేమలత రికమండ్ చేసింది కాబట్టే, ఈ ఇంటర్వ్యూకైనా నువ్వు రాగలిగావ్ ..... ఉద్యోగం అవసరం అంటే ఖాళీలుండొద్దా ..... ?” అంది మహతి ముఖం వైపు తేరిపారచూసి.

“ఇంత అందంగా వున్నావ్ ..... బ్యూటీపార్లర్ పెట్టకూడదూ ..... నీ కాళ్ళమీద నువ్వు నిలబడినట్టుగా వుంటుంది. నీ దగ్గర ఇంకా యిద్దరు ..... పని చేయొచ్చు కూడా ..... ” ఓ ఉచిత సలహా పారేసింది హెడ్ మిస్ట్రెస్.

“బ్యూటీ పార్లర్‌లో బ్యూటీషియన్ ..... అందంగా వుందని చెప్పి ఎవరూ కష్టమర్లు రారు గదా మేడమ్ ..... ” అసహనంగా అంది మహతి.

---

అతనే మనకు తెల్సిన రాకెన్‌రోల్ కింగ్ ఎల్విస్ ప్రెస్లీ-మనలో నిజమైన ప్రతిభ వుందని మనకు స్పష్టంగా తెల్సినపుడు, నిరాశ ఎదురయినపుడు, ఎవరూ మనకు సహకరించనపుడు, నీ ప్రతిభకు నువ్వే పదును పెట్టుకోవాలి. అనే సందేశాన్ని మనకిస్తున్నాడు ఎల్విస్ ప్రెస్లీ.

అలాగే-

నంగ్యాల్ వాగుండి - ఆ నంగ్యాల్ వాగుండి ఇంకోపేరు కుంజంగ్ భుటియా. వాగుండి నేపాల్‌లోని ఒక బీద కుటుంబంలో పుట్టాడు. కుక్కల్ని పెంచడంతోపాటు

కొండలను ఎక్కడం ఆయన సరదాలు. అవలీలగా ఎంత ఎత్తైన కొండలైనా ఎక్కేసేవాడు. అంతే వేగంతో దిగేవాడు.

తనమీద తనకు ఆత్మవిశ్వాసం ఏర్పడింది ప్రంపంచం గుర్తుపెట్టుకునే అనితర సాధ్యమైన పనిని చెయ్యాలని సంకల్పించుకున్నాడు. అందుకు ప్రపంచంలో అతి ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కాలని నిర్ణయించుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన ఇంకో ఔత్సాహిక పర్వాతారోహకుడు. ఎడ్మండ్ హిల్లరీతో కలసి మంచు పర్వతాన్ని ఎక్కడానికి సంకల్పించాడు. 1953 మార్చి 29న 8,848 మీటర్ల ఎత్తునున్న ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కి, అక్కడ భారత పతాకాన్ని ప్రతిష్ఠించి, తన ప్రత్యేకతను ప్రపంచ ప్రజలకు చాటి చెప్పి చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడు. భారత ప్రభుత్వం పద్మ భూషణ్ బిరుదుతో సత్కరించింది. 1954 లో వెస్టు బెంగాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హిమాలయన్ మౌంటనింగ్ ఇన్‌సిట్యూట్‌కు ట్రైనింగ్ డైరెక్టర్‌గా నియమింపబడ్డాడు. మనిషిలోని అనితరమైన శక్తికి, ఏకైక ఉదాహరణ వాగుండి. ఇంతకీ వాగుండి ఏవరో తెల్సిందా? టెన్సింగ్ నార్కే. అలాంటి వారి జీవితాలను స్మరించుకుంటూ ముషీరాబాద్ చౌరస్తాలో బస్సు దిగింది మహతి. అక్కడో ఫ్రెండ్‌ని కలవడానికి వెళ్తోంది. హేమలత దగ్గర్నించి మొదట తను బయటపడాలంటే, ఏదో చిన్నదైనా పెద్దదైనా ఉద్యోగం కావాలి.

తను ఓ వారంరోజుల్లో ముందు ఉద్యోగం సంపాదించాలి. ఆ తర్వాత నెమ్మదిగా తనేం చెయ్యాలో ఆలోచించాలి. దారిలో వెల్‌స్టిచ్ లేడీస్ టైలర్స్--

సిటీలో స్త్రీలచే నడుపబడుతున్న చాలా పెద్ద టైలరింగ్ షాపు అది. ఊసుపోవడానికి రెణ్ణెలపాటు తను అల్లికలు, కుట్లు నేర్చుకున్న విషయం గుర్తుకొచ్చింది మహతికి.

ఏవైనా వేకెన్సీలున్నాయేమో, ట్రై చేస్తే ..... ?

ఆ ఆలోచన రాగానే, లేడీస్ టైలర్ షాపులోకి నడిచింది. చాలా సిస్టమేటిగ్గా వుంది ఆ షాపు. డీసెంట్‌గా వుంది లోన హాలు. ఆ హాల్లో ఓ ముప్పై అధునాతన కుట్టు మిషన్ల ముందు కూర్చునివున్న చాలమంది అమ్మాయిలు. లోనికివస్తున్న మహతివేపు, మహతి అందంవేపు కళ్ళప్పగించి చూస్తున్నారు. ప్రక్కనేవున్న గ్లాస్

రూంలో నలభైఏళ్ళ వయస్సున్న ఆవిడ కూర్చుని వుంది. ఆవిడే ఓనర్ అయుంటుంది అనుకుంది మహతి. అటువేపు నడిచింది.

"వెల్‌కమ్ మేడమ్. వాట్‌డూయూ వాంట్ ..... ప్లీజ్" చాలా వినయంగా అడుగుతున్న ఆవిడవేపు నడిచింది మహతి.

"నాకు అల్లికలు, కుట్లు వచ్చండి. మీ షాపులో ఏవైనా ఖాళీలున్నాయోమోనని ..... " మెల్లిగా అంది మహతి.

ప్రపంచాన్ని శాసించే సౌందర్యంతోనూ, ప్రపంచాన్ని కొనగలిగే ధీమాతోనూ కన్పించిన మహతి అలా అడిగేసరికి ఆ టైలర్ షాపు ఓనర్ చూపుల్లో మార్పు వచ్చింది. ఆ మార్పును స్పష్టంగా గమనించింది మహతి.

"ఇలాంటి పనులు నువ్వు చెయ్యగలవా? అయినా స్టిచింగ్‌లో డిప్లొమో వున్న వాళ్ళనే మేం తీసుకుంటున్నాం"

"నాకు డిప్లమో వుందండి. లేడీస్‌కి కావాలసిన మోడ్రన్ స్టిచింగ్ నాకు తెల్సు ..."చెప్పింది మహతి.

"కూర్చో" ఆ మాట అనగానే అంతవరకూ నిలబడిన మహతి కూర్చుంది.

"చూడమ్మా ..... పేరేమిటన్నావ్ ..... "

"మహతి"

"ఏం చదువుకున్నావ్ ..."

"బి.ఎస్. సి ..... "

"అంత చదువు చదువుకుని ..... " ఆశ్చర్యంగా మహతివేపు చూసిందామె.

"పేరెంట్స్ వున్నారా ..... " ఆ ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు. తండ్రి పేరు చెప్తే మళ్ళీ వివరాలన్నీ అడుగుతుంది!

"మంత్లీ సాలరీ మీద పనిచేస్తావా. డైలీ వేజస్ మీద పని చేస్తావా ..... "

"మీ ఇష్టం"

"మంత్లీ సాలరీ మీద పనిచేస్తే ..... ఇక్కడ రోజుకి రెండు షిఫ్టులుంటాయి. పదిహేను రోజులకి షిఫ్టులు మారుతుంటాయి. నెలకు ఆరు వందలిస్తాం, అదే డైలీవేజస్‌లో పనిచేసావనుకో ..... రోజుకు నువ్వు కుట్టిన దుస్తులకు సంబంధించి, మా కమీషన్ మేం తీసుకుని నీ రేటు నీకిస్తాం ..... ఏది కోరుకుంటావో నీ ఇష్టం."

"మంత్లీ సాలరీకే పనిచేస్తానండి ..... " ముద్దుగా అంటున్న మహతి వేపు ముచ్చటగా చూసింది ఆ ఓనర్.

"అయితే రేపు తొమ్మిది గంటలకు వచ్చెయ్. వచ్చేటప్పుడు నీ డిప్లమో సర్టిఫికెట్ తీసుకురా ..... " చెప్పిందావిడ.

"థాంక్స్ మేడమ్"

బయటకొచ్చిన మహతికి చాలా ఆనందంగా వుంది. ఫ్రెండ్ దగ్గర కెళ్ళే ప్రోగ్రాం కేన్సిల్ చేసేసి తనకు ఉద్యోగం దొరికిందనే విషయం అర్జంటుగా హేమలతతో చెప్పాలి - ఆ తర్వాత ఓ రూం చూసుకోవాలి - అ తర్వాత తన దగ్గరున్న డబ్బుల్తో ముందు మెహిదీపట్నం స్టేట్ బ్యాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేయాలి. ఇక్కడ పనిచేస్తూనే ఇంకా బెటర్‌మెంట్ కోసం ట్రై చెయ్యాలి అనుకుంది.

ఆ ఆలోచనలతోనే నడుస్తోంది మహతి.

ఆ సమయంలో ఆమెకు మధుకర్ జ్ఞాపకం వచ్చాడు. ఏం చేస్తుంటాడు మధుకర్ ..... ? ఉద్యోగం వేటలో తిరుగుతున్నాడా? బిజినెస్ చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడా?

ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకూ నడిచొచ్చిన మహతికి కాఫీ తాగాలనిపించి, అక్కడ రోడ్డుకు ఎడమ వేపునున్న హోటల్లోకి నడిచింది.

ఆమె ఆ హోటల్లోకి వెళ్ళిన మరుక్షణమే, రోడ్డుకి కుడివేపునున్న హోటల్లోంచి భోజనం చేసి బయటకొచ్చాడు మధుకర్ .

అలవాటుకొద్దీ పాన్ షాప్‌కు నడిచి త్రిబుల్‌ఫైవ్ ప్యాకెట్ ఒకటివ్వు అని అనగానే అప్పుడు జ్ఞాపకం వచ్చింది మధుకర్‌కి.

సిగరెట్ తాగకూడదనే మహతి కండిషన్.

“వద్దులే ..... సారీ” అని చెప్పేసి వచ్చి, చౌరస్తాలో నిలబడ్డాడు.

ఉదయం నుంచి తిరగడంవల్ల చాలా అలసటగా వుంది. వెంటనే హాస్టల్‌కెళ్ళి పడకేసెయ్యాలి.

సినిమాల కెళ్ళే సమయం కావడం వల్ల రోడ్డంతా గందరగోళంగా వుంది. సినిమా చూడకపోతే ప్రాణాలు పోతాయేమో అన్నంత టెన్షన్‌తో వెళుతున్న జనం వేపు చూసి నవ్వుకున్నాడు మధుకర్ .

రోజూ ఇంత జనం ఎక్కడ నుంచి పుట్టుకొస్తారో ..... బస్సెక్కినా జనం ..... రోడ్డెక్కినా జనం ..... సిన్మాహాలు దగ్గర చూసినా జనం ..... రైల్వే స్టేషన్ దగ్గర చూసినా జనం ..... బాధ్యత లేని ..... నేషనల్ ఎకౌంటబిలిటీ లేని పందులు ..... ఛీ ..... ఛీ ..... ఇప్పటికీ పదిమందిని కనే ఇండియన్స్ ఉన్నారట ..... ఉరితీయాలి వాళ్ళందర్నీ.

ప్రపంచంలో ఎక్కడ జనం కనబడరో, అక్కడకెళితే ఎంత బాగుంటుందో ..... ?

మధుకర్‌కి ఈ ఆలోచన ఎంతో బాగా నచ్చింది. భార్యాపిల్లల్నీ, రాజ్యాన్నీ, భోగాన్నీ వదిలిన సిద్ధార్థుడు జ్ఞాపకం వచ్చాడు. సిద్ధార్థుడికి భార్యా, పిల్లలు వున్నారు. తనకు లేరు. అంతే తేడా. కానీ సిద్ధార్థుడు వ్యాపారం చెయ్యాలని మాత్రం వెళ్ళ లేదు కదా.

మరి తను వ్యాపారం చెయ్యాలంటే ..... ఇప్పుడున్న ఈ నాలుగు వందలు, ఆపై కొంత చిల్లరతో, ఈ హైద్రాబాద్‌లో ఏం వ్యాపారం చేస్తాడు? నాలుగురోజుల క్రితం, ఈ నాలుగు వందలూ అంటే తన బార్ బిల్లులో మూడో వంతు.

తను వ్యాపారం చెయ్యాలి.

ఏ వ్యాపారం చేస్తాడు? ఏ వ్యాపారం చెయ్యాలన్నా తనకు ముందు డబ్బు కావాలి.

ఏ ఫ్రెండ్‌కి ఫోన్ చేసినా, పాతిక లక్షలన్నా వస్తాయి.

“స్వశక్తితోనే వ్యాపారం చెయ్యాలి” అన్న మహతి మాట గుర్తుకొచ్చింది.

హాస్టల్ పిట్టగోడ మీద మూర్తి, నిధి దయాళ్ కూర్చున్నారు. పక్కన గోడకు చేరబడి నించున్నారు విజయ్, సురేష్.

“మనబాస్ మధు సంగతేంట్రా ..... అంతేనా ..... మహతి సవాల్ చెయ్యడం, వీడు వ్యక్తిత్వంతో బతుకుతానని ఇంట్లోంచి వచ్చెయ్యడం ..... బాగానే వుంది ..... బతుకుతాడా ..... ” సందేహంగా అన్నాడు సురేష్.

అదే సమయంలో హాస్టల్ మెట్లెక్కుతూ, తన గురించి మిత్రుల మాటలు వినిపించడంతో మలుపు దగ్గర ఆగిపోయాడు మధుకర్ .

“ఇన్నాళ్ళూ వాడిమీద మనం వాలిపోయామా ..... ఇప్పుడు మనమీద వాడు వాలిపోతాడు. అంతే ..... ఇకనుంచి మనం చందాలు వేసుకుని, వాడ్ని పోషించాల్సిందే ..... ” మూర్తి జోగ్గా అన్నాడు.

ఆ మాటకు మధుకర్ మనసు చివుక్కుమంది.

“సిగరెట్ లేకపోతే అయిదు నిమిషాలుండలేడు. మందు లేకపోతే పావుగంట వుండలేడు- కరెన్సీ లేకపోతే కాళ్ళూ చేతులు కదలవు. వాడు స్వయంశక్తితో నిలబడతాడా ..... నో ..... నెవ్వర్ ..... కావలిస్తే బెట్ రా ..... ” నిధి దయాళ్ అన్నాడు.

మరెందుకో పైకి వెళ్ళాలనిపించలేదు మధుకర్‌కి. గబగబా కిందకు దిగిపోయాడు. తనను అర్థం చేసుకున్న మిత్రుల మనస్తత్వానికి నవ్వొచ్చింది మధుకర్‌కి.

రోడ్డుమీద కొచ్చిన మధుకర్ కి, ఆ రాత్రి తెరువెరుగని దీర్ఘరాత్రిలా ఉంది.

కొన్ని రోజుల క్రితం బతుకు నియాన్ లైట్ల తోరణంలా  ఉండేది. కానీ ప్రస్తుతం -- ఒకే ఒక లైట్‌హౌస్ ముందు నిశ్శబ్దంగా నించున్న సముద్రంలా ఉంది.

దారిలో కనిపించిన మెస్‌లో భోజనం కానిచ్చేసి, రైల్వే స్టేషన్ కెళ్ళాడు.

అయిదు రూపాయలిచ్చి, ఫస్ట్‌క్లాస్ రిటైరింగ్ రూంలో కూర్చున్నాడు. కుర్చీలోనే కునుకుపాట్లు పడుతున్నాడు.

ఒంటిగంట.

రెండు.